సాక్షి
మహబూబాబాద్

బుధవారం | 9 | ఆగస్టు | 2023



అడవే అమ్మఒడి..

దేశానికి స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడిచినా అడవితల్లినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అనేకమంది నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉన్నారు.

- 8లో▸



బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం

బహుజన ప్రభుత్వం విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 / 25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉండి సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు: మంత్రి

మహబూబాబాద్: నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిపుత్రులకు మంత్రి సత్యవతిరాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పోడు భూములకు పట్టాల పంపిణీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గిరిజనులను రైతులుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణయుగమని, రిజర్వేషన్ పెంచడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ



మహబూబాబాద్/నెహ్రూసెంటర్: ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా అంబరీష మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కార్యాలయంలోనే పలువురు అధికారులు అంబరీషకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలలోనే వ్యాధి నిరోధక శక్తి



మహబూబాబాద్: తల్లి పాలలోనే వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ హైమావతి అన్నారు. లయన్స్ క్లబ్ మానుకోటశాఖ సహకారంతో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో 60మంది గర్భిణులకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సాముహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు తాగించాలన్నారు. ఆరు నెలలు పాటు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, సుజాత, హేమ, రోజా, కనుకలక్ష్మి, నీరజ, కరుణశ్రీ, సీడీపీలు, గర్భిణులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మహబూబాబాద్: సెకండ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏటీయూసీ రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్‌ఎంలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా సెకండ్ ఏఎన్‌ఎంలు పీహెచ్‌సీల్లో పని చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో ఏఎన్‌ఎంలు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వర్తించారని కొనియాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నవీన్, సెకండ్ ఏఎన్‌ఎంలు జ్యోతి, అశ్విని, రాములమ్మ, సువర్ణ, భాగ్య, సుమలత, పార్వతి, విజయ, తులసి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌సీయూలో పిల్లల మార్పిడి

- తిరిగి అప్పగింత

నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎస్ఎన్‌సీయూలో ఉన్న పిల్లలను మంగళవారం రాత్రి ఒకరికి బదులు మరొకరిని అప్పగించగా ఆందోళన జరిగింది. వివరాలు ఇలా.. భూక్య సుమితకు జన్మించిన మగ శిశువును ధరావత్ సునీత సంబంధికులకు ఎస్ఎన్‌సీయూ సిబ్బంది అప్పగించారు. అదేవిధంగా ధరావత్ సునీతకు జన్మించిన ఆడ శిశువును మాత్రం ఎస్ఎన్‌సీయూలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే భూక్య సుమితకు జన్మించిన మగశిశువును ధరావత్ సునీత సంబంధికులకు ఇవ్వగా, శిశువు సంబంధికులు, బంధువులు ఆందోళనకు దిగారు. భూక్య సుమిత భర్త శివ మాట్లాడుతూ.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇలా జరిగిందని ఆరోపించాడు. ఈ విషయంపై డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ.. సుమితకు బదులు సునీత సంబంధికులకు పొరపాటున మగ శిశువుని ఇవ్వడం జరిగిందన్నారు. తిరిగి శిశువును సుమితకు సిబ్బంది ఇచ్చారని పేర్కొన్నారు.

పారదర్శకం..



- ఏజెన్సీల ద్వారా కిరాయి డబ్బులు
- రైతులు ధాన్యం అమ్మిన చోటే ట్రాక్టర్ బాడుగ
- కాంట్రాక్టర్లతో తలెత్తిన ఇబ్బందుల మేరకు నిర్ణయం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్
- ట్రక్‌షీట్లు ఇచ్చేందుకు పలు ఏజెన్సీల వెనకడుగు



ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల నుంచి పలువురు రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. అయితే చాలా మంది రైతులకుట్రాక్టర్ కిరాయి అందడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కొందరు మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు కుమ్మక్కై డబ్బులు కాజేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. దీంతో రైతులు తమకు ట్రాక్టర్ కిరాయి రాలేదని నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎక్కడా లేని విధంగా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకున్నారు. కొనుగోలు కేంద్రాలు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లకు కాకుండా నేరుగా ఏజెన్సీలకే ట్రాక్టర్ కిరాయి అందజేయాలని భావించారు. ఇందుకు ఏజెన్సీల వారీగా ట్రక్‌షీట్లు జమచేయాలని ఆదేశించారు. అయితే కొందరు సంతోషంగా ట్రక్‌షీట్లు జమచేసి సివిల్ సప్లయీస్ కార్యాలయంలో అందజేస్తుండగా.. మరికొందరు నేరుగా కాంట్రాక్టర్లకే ఇస్తామని చెబుతున్నారు.

అనుభవాలు..

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు రవాణా చేసేందుకు జిల్లాలో మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, గూడూరు, కేసముద్రం సెక్టార్లుగా విభజించి ట్రాన్స్‌పోర్టుకు టెండర్లు పిలుస్తున్నారు. అయితే కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై నిబంధనల ప్రకారం లారీలు పెట్టడం లేదు. దీంతో తక్కువ లారీలతో ధాన్యం దిగుమతి చేస్తే కాంటాలు పెట్టినా.. ఎగుమతి ఆలస్యం కావడంతో రైతులు వారాలకొద్దీ కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాసేవారు. దీనిని అధిగమించేందుకు కొందరు రైతులు స్వయంగా ట్రాక్టర్లు పెట్టి ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. అయితే ఈ కిరాయి డబ్బులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు కాకుండా కాంట్రాక్టర్ల ఖాతాల్లో పడుతున్నాయి. దీంతో రైతులకు సరిగా డబ్బులు అందకపోవడం, లేదా సగమే రావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

కలెక్టర్ నిర్ణయంతో..

గతంలో మాదిరిగా కాకుండా ఈ యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు ధాన్యం రవాణా చేసిన డబ్బులు ఏజెన్సీల ద్వారా నేరుగా రైతులకు అందించేలా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. రవాణా కాంట్రాక్టర్లు పెట్టిన వాహనాలు పోగా.. రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణా చేసిన ట్రక్‌షీట్లు ఏజెన్సీల ద్వారా సివిల్ సప్లయీస్ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆ డబ్బులు ప్రభుత్వం నేరుగా ఏజెన్సీల ఖాతాల్లో వేస్తుంది. అక్కడి నుంచి రైతుల ఖాతాల్లో జమచేస్తారు. ఇలా రైతులు ఎక్కడైతే ధాన్యం అమ్ముకున్నారో అక్కడే రవాణా డబ్బులు కూడా తీసుకునే అవకాశం ఉంది.

వెనకాడుతున్న ఏజెన్సీలు..

కలెక్టర్ ఆదేశాలతో రైతుల ట్రక్‌షీట్లు ఇచ్చేందుకు కొన్ని ఏజెన్సీలు సుముఖంగా ఉండి సివిల్‌సప్లయీస్ కార్యాలయంలో అందజేస్తుండగా.. కొన్ని వెనకాడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ యాసంగి సీజన్‌లో 192కొనుగోలు కేంద్రాల ద్వారా 11,20,434 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యాన్ని 10,262 వాహనాల ద్వారా మిల్లులకు ఎగుమతి చేశారు. ఇందులో సుమారు మూడువేల వరకు రైతులు పెట్టిన ట్రాక్టర్లు ఉంటాయని సమాచారం. కాగా రైతుల వద్దనుంచి ట్రక్ షీట్లు తీసుకున్న ఏజెన్సీల్లో ఇప్పటి వరకు 1,500 ట్రక్‌షీట్లు కూడా సివిల్ సప్లయీస్ కార్యాలయంలో ఇవ్వలేదని సమాచారం. గతంలో ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన పలువురు ఏజెన్సీల నిర్వాహకులే ఇప్పుడు ట్రక్‌షీట్లు ఇచ్చేందుకు వెనకాడుతున్నారని తెలిసింది. ట్రక్‌షీట్లు ఇస్తే లెక్క చెప్పాల్సి ఉంటుంది. లేదా రైతులకు డబ్బులు ఇచ్చినట్లు యూసీ తీసుకోవాల్సి ఉంటుంది. అదే కాంట్రాక్టర్ ద్వారా అయితే ఏ లెక్క చెప్పాల్సిన అవసరం లేదనే ఉద్దేశంతో కొన్ని ఏజెన్సీల నిర్వాహకులు ట్రక్‌షీట్లు అందజేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాక్టర్ కిరాయి డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌పోర్టు డబ్బుల చెల్లింపులు ఇలా..(టన్నుకు)

సెక్టార్	8కిలో మీటర్ల లోపు	8నుంచి 20కిలోమీటర్ల వరకు
మహబూబాబాద్	రూ. 323-47	రూ. 5-90
తొర్రూరు	రూ. 325-46	రూ. 5-93
కేసముద్రం	రూ. 331-45	రూ. 6-94
మరిపెడ	రూ. 325-46	రూ. 5-93
గూడూరు	రూ. 323-47	రూ. 5-90

యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు(క్వింటాళ్లు)

ఏజెన్సీ	గ్రేడ్-ఏ	కామన్	మొత్తం
పీఏసీఎస్	3,42,360.40	4,53,115.20	7,95,475.60
ఐకేపీ	1,44,551.20	1,33,982.00	2,78,533.20
డీఎఫ్‌పీసీఎల్	8,808.40	4,793.20	13,601.60
జీసీసీ	13,244.80	4,644.40	17,889.20
మెప్మా	2,148.00	12,787.20	14,935.20
మొత్తం	5,11,112.80	6,09,322.00	11,20,434.80

అన్నం పెట్టేదెవరు.. బడికి పంపేదెవరు..



బంధువుల ఒడిలో చిన్నారులు



తల్లిదండ్రులతో ముగ్గురు చిన్నారులు (ఫైల్)

- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు చిన్నారులు
- రెండేళ్ల క్రితం తల్లి, ప్రస్తుతం బాత్‌రూంలో కాలు జారిపడి తండ్రి మృతి
- మరిపెడ మండలంలోని గాలివారిగూడెంలో ఘటన
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

మరిపెడ రూరల్: నవ మాసాలు మోసిన తల్లి రెండేళ్లక్రితం మృతిచెందగా.. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తండ్రి బాత్‌రూంలో కాలుజారి పడి మంగళవారం మృతి చెందాడు. దీంతో లోకం తెలియని ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు. 'ఆ చిన్నారులకు స్నానం చేయించేదెవరు.. సమయానికి అన్నం పెట్టి బడికి సాగనంపేదెవరు.. కష్ట మొస్తే ఆదుకునేదెవరూ.. కన్నీళ్లు వస్తే తుడిసేదెవరు' అంటూ స్థానికులు కంటతడి పెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామానికి చెందిన పెయింటర్ ఎడెల్లి ఉపేందర్ (32)కు, మండల కేంద్రానికి చెందిన ఉమారాణితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి జీవితం సాఫీగా సాగుతున్న క్రమంలో ఉమారాణి బాలింతగా ఉన్న సమయంలో మరిపెడ పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వల్ల వైద్యం వికటించి ఆగస్టు 14, 2021లో మృతి చెందింది. అప్పటి నుంచి తండ్రి ఉపేందర్ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. ఈ క్రమంలో మరోసారి విధి పగబట్టింది. తల్లిని కోల్పోయిన పిల్లలకు తండ్రిని కూడా దూరం చేసింది. ఉపేందర్ బాత్‌రూంలో స్నానం చేస్తుండగా కాలు జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. దీంతో అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు ప్రస్తుతం నానమ్మ తాతయ్యలైన అంజమ్మ, వీరయ్య వద్ద ఉన్నారు. కాగా పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని, దాతలు సాయమందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం



సమావేశంలో మాట్లాడుతున్న చుంచు శ్రీశైలం

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయ పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు నిర్వహించలేదన్నారు. అన్ని అడ్డంకులను తొలగించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం అమలు చేస్తున్న మన ఊరు-మనబడి కార్యక్రమం ప్రచారానికే పరిమితమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏను తక్షణమే విడుదల చేసి, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులపై మాటల్లో చూపిస్తున్న ప్రేమను చేతల రూపంలో నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాచకొండ ఉపేందర్, శ్రీనివాస్, కార్తీక్, శ్రీనివాసులు, సుధాకర్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

కురవి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.5,500 కోట్లు విడుదల చేసి, విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు దిలీప్, రఘు, జగదీష్, సంతోష్, శ్రీనివాస్, జైపాల్, నవీన్ ఉన్నారు.

గొర్రెల యూనిట్ల పంపిణీకి సిద్ధమవ్వాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీనికి సిద్ధమవ్వాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గొర్రెల యూనిట్ల పంపిణీపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు రెండో విడత గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలన్నారు. ఇందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. యూనిట్ సేకరణకు అధిక సంఖ్యలో బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు గుర్తించాలి..

ప్రజా అవసరాల దృష్ట్యా ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ స్థలాల గుర్తింపుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మానుకోట వ్యవసాయ మార్కెట్ రైతులు తీసుకొచ్చే వ్యవసాయోత్పత్తులకు సరిపోవడం లేదన్నారు. విశాలమైన నూతన మార్కెట్ ఏర్పాటుకు 20ఎకరాల స్థలం అవసరమన్నారు. అలాగే గిరిజన భవనం, అంబేడ్కర్ భవనాలకు స్థలం కేటాయించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటికి కూడా స్థలాలను కేటాయించాలన్నారు. పోలీస్‌శాఖ పరేడ్ కోసం గ్రౌండ్ అవసరమన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

- డీఈఓ రామారావు



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

కురవి: విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని డీఈఓ రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేందుకు ఉపాధ్యాయులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, కోర్సు డైరెక్టర్ జయసాగర్, ఆర్‌పీలు చంద్రశేఖర్, భాస్కర్, శివప్రసాద్, రామకృష్ణ, సీఆర్‌పీ వెంకన్న పాల్గొన్నారు.

మెరుగైన బోధన చేయాలి..

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ద్వారా ప్రాథమికస్థాయి విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి డీఈఓ హాజరై మాట్లాడారు. ఏసీజీఈ శ్రీరాములు, సీఎంఓ ఆజాద్ చంద్రశేఖర్, పరిశీలకులు సదయ్య, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిగ్రస్తులు అధైర్యపడొద్దు



కిట్లు పంపిణీ చేస్తున్న మురళీధర్

దంతాలపల్లి: బోదకాలు వ్యాధిగ్రస్తులు అధైర్యపడొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. మండలంలోని పీహెచ్‌సీలో మంగళవారం వ్యాధిగ్రస్తులకు ఆయన ఎంఎండీపీ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. బోదకాలు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ప్రభుత్వం ప్రత్యేకంగా కిట్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు చైతన్య, సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ యాకన్న, సీహెచ్‌ఓ బాలాజీ, మలేరియా నోడల్ అధికారి శ్రీనివాసులు, సత్యనారాయణ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుమిగూడిన దరఖాస్తుదారులు



దరఖాస్తు నింపుతూ..





అధికారికి దరఖాస్తులు అందజేయడానికి క్యూలో నిల్చున్న ప్రజలు

'గృహలక్ష్మి' సందడి..

ఇల్లు లేని నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం మానుకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బారులుదీరారు. దరఖాస్తు ఫారాలు నింపి కార్యాలయంలో అందజేశారు. కాగా తహసీల్‌తో పాటు జిరాక్స్ సెంటర్ల వద్ద దరఖాస్తుదారుల సందడి కనిపించింది.

-సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

బిందె నీటితో నారుకు జీవం..

బయ్యారం: నీటితడి లేక ఎండిపోతున్న వరినారును చూడలేక ఓ రైతు బిందెతో నీళ్లు తెచ్చి జీవం పోశాడు. మండల కేంద్రానికి చెందిన ఎనుగుల మురళి బయ్యారం పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో వరిసాగుకు నారు పోశాడు. అయితే చెరువు కాల్వలు అధ్వానంగా ఉండడంతో నీరు అందని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రైతు బిందెతో నీటిని తెచ్చి నారుకు పోశాడు.



స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటన



రావిరాలలో అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమాదేవి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి, నడివాడ, వేమునూరు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీల పనితీరును పరిశీలించింది. గ్రామీణ పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు వాడకం, నిర్వహణ, తడిపొడి చెత్త సేకరణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను పరిశీలించింది. కాగా స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా సేకరించిన అంశాల ఆధారంగా ర్యాంకులు కేటాయించనున్నారు. కార్యక్రమలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీ గోవిందరావు, జెడ్పీ సీఈఓ రమాదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ హరిప్రసాద్, ఏపీఎం తిలక్, ఏపీఓ రమేష్ రెడ్డి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీఓఏలు, ఇతర అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రావిరాల గ్రామంలో..

నెల్లికుదురు: మండలం రావిరాల గ్రామంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం పర్యటించింది. జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శేషాద్రి, ఎంపీఓ పార్థసారథి, కోఆర్డినేటర్ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామంలో పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, అంగన్‌వాడీ సెంటర్, జీపీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉబ్బని అనిల్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్



నెట్‌వర్క్: మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్‌గా మాందాటి శ్రీనివాస్‌ను నియమించినట్లు సంస్థ రాష్ట్ర చైర్మన్ డబ్బేటి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాందాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధితో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సంస్థ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు వెంకటరమణయ్య, రాష్ట్ర చైర్మన్ డబ్బేటి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9వతేదీ నుంచి ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్తిలో వాటా కోసం .. నిరసన

- మాజీ ఎంపీ కల్పనాదేవి వారసుడి ఆందోళన



తల్లిదండ్రుల ఫొటోలతో నిరసన చేస్తున్న మాజీ ఎంపీ కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా తన సోదరుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, దివంగత కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తన వాటా ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ హనుమకొండ పద్మాక్షికాలనీలోని జయ నర్సింగ్ కళాశాల ఎదుట మంగళవారం అమ్మ, నాన్న ఫొటోలను వెంటబెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉరితాళ్లతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న పలువురు స్థానికులు జయసింహారెడ్డి ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆస్తిలో భాగమైన 60 ఎకరాలను తనకు తెలియకుండా సోదరుడు నర్సింగరెడ్డి రియల్ ఎస్టేట్‌కు అప్పగించాడని, వారసత్వ ఆస్తుల లెక్కలు తేల్చకుండా పత్రాలను దాచిపెట్టి తనకు వాటా దక్కకుండా ఒక్కడే అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా నర్సింగరెడ్డి తన ఆస్తుల, ఆదాయ లెక్కలను తేల్చి తనకు రావాల్సిన వాటా ఇవ్వకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు.

అడవే అమ్మఒడి..

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం ఏజెన్సీ గూడేలు

- ప్రకృతితోనే జీవన గమనం
- పూర్వీకుల నుంచి ఆచరణ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం : చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో కొండలు..గుట్టలు, ఆ మధ్యలో ఆవసాలు.. వాటి చుట్టు ఉండే వాగులు.. వంకలు..సెలయేరులు.. అటవీ జంతువులతో సహవాసం.. ప్రకృతితో మమేకం. ఇవి ఆదివాసీల జీవన విధానానికి ప్రతీక. బహ్య ప్రపంచానికి ఏ మాత్రం సంబంధం లేని జీవన విధానం వారి సొంతం. మైదాన ప్రాంత భాష, అలవాట్లు, ఆచారం, ఆహార్యానికి పూర్తి విరుద్ధం. ప్రపంచం కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా ఇప్పటికీ తమ ఆచారం, సంప్రదాయం, సంస్కృతులను అలాగే కొనసాగిస్తున్నారు. అడవిలో లభించే దుంపలు..ఇతర కాయలు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. నీరు, అటవీ ప్రాంతాలనే ఆసరా చేసుకుని నాడు పూర్వీకులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాసాలే నేటి ఆదివాసీ గూడేలు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమావేశం

ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల సంఘం నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను పరిరక్షించడం తోపాటు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 70 దేశాల్లో 5వేల తెగలకు చెందిన 40 కోట్ల జనాభా ఉందని సమాచారం. ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలు ఉండగా 92 శాతం వరకు అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అడవులు, కొండలతో నిండి ఉంటుంది. గూడేలు, పెంటల్లో ఆదివాసీ మానవ సమాజం తొలిబిడ్డలు గోండు, కోయ, కోలాం, ప్రర్ధాన్, నాయక్‌పోడ్, బగత, జాతపు, కొండారెడ్డి, చెంచు, ఖోందు, అంధ్, ముఖదొర, ఆరోగ్యం మున్నెంవార్ వంటి జాతులున్నాయి.



కొమ్ము నృత్యం చేస్తున్న దింసా కళాకారులు (ఫైల్)

విద్య, వైద్యం కోసం నేటికీ పోరాటాలే..

అంతర్జాతీయంగా ఆదివాసీల సమస్యలు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పర్యావరణం వంటి అంశాల పరిరక్షణకు సమితి సర్వప్రతినిధి సభ 1993లోనే తీర్మానం చేసింది. కాగా, జిగురు, బంక, ఇప్పపువ్వు, తునికాకు, చింతపండు, తేనె, చీపుర్లు, విస్తారాకులు, కలప, తదితర అటవీ ఉత్పత్తులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడి జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. విద్య, వైద్యం కోసం ఇప్పటికీ ఏదో చోటా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీల చట్టాలు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఉన్నా వనరులు దోపిడీ అవుతున్నాయని ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం వచ్చిన క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6546 మందికి మందికి పోడు పట్టాలు ఇచ్చారు.



చింతలమోరి గొత్తికోయగూడెం

గూడేల్లో సౌకర్యాలు కరువు

స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేక ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలకు ప్రభుత్వాలు ఇప్పటి వరకూ కనీస వసతులు కల్పించలేకపోయాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంటున్నారనే ఒకే కారణం వారికి శాపంగా మారింది. రోడ్లు ఉండవు.. తాగు నీరు లేదు. విద్యుత్ సరఫరా, పక్కా ఇళ్లు, పాఠశాలు, పౌష్టికాహారం కూడా లేని దీనస్థితిలో గొత్తికోయలు కాలం వెళ్లదీస్తున్నారు.

నృత్యాలు

ఆదివాసీలోని పలు రకాల తెగల్లో ఒక్కొక్కరు ఒక్క రకమైన నృత్యం చేస్తారు. ఇందులో కొమ్ము నృత్యం, దింసా, డోలు నృత్యాలు ఉంటాయి. ఈ నృత్యాలు పెళ్లిళ్లు, జాతర, పండుగల సమయంలో ఎక్కువగా చేస్తారు.



కంతనపల్లి అడవిలో నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)

ఆదివాసీల హక్కులను కాపాడాలి



ఆదివాసీల హక్కులను కాపాడాలి. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు పాలకులు మారినా ఆదివాసీల రాతలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పథకాలు కింది స్థాయికి చేరితేనే అభివృద్ధి సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాలి.

– కొప్పుల సరిత, ఆదివాసీ మహిళ, ఏటూరునాగారం

సంస్కృతిని పరిరక్షించాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూడాలి. పండుగలు, ఆచారాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. వాటికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఘనంగా జరపాలి.

– కబ్బాక శ్రావణ్, ఏటూరునాగారం

ఆచారాలు, సంప్రదాయాలు

కోయ మహిళలు నేల మీదే ప్రసవిస్తారు. మంత్రసానులు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం వారి ఆచారం. పిల్లల పేర్లు ఇలవెల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువగా ఉంటాయి.

పండుగలు.. దేవతలు

కోయల పండుగలు విభిన్నం.. విశిష్టం. వీరు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండగ, సూరాల పండుగ, సుంకుల పండుగ చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకుంటారు.

బావమరిది మృతదేహం తీసుకొస్తుండగా ప్రమాదం.. బావ మృతి

మరిపెడ/బయ్యారం: అనారోగ్యంతో చనిపోయిన బావమరిది మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ మృతిచెందాడు. ఈ దుర్ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య(40) బావమరిది అదే గ్రామానికి చెందిన గజ్జి సంపత్(43) హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతన్ని మృతదేహాన్ని బావ సారయ్య ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మరిపెడ మీదుగా స్వగ్రామానికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై కాలువవెంట నిర్మించిన రోడ్డు వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ముందు కూర్చున్న సారయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న గజ్జి అప్పయ్య, డ్రైవర్ శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.



సారయ్య(ఫైల్)



సంపత్ (ఫైల్)

రైలుకు వెళ్లినా బతికేవాడు..

సారయ్య భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బావమరిది సంపత్ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సారపాక వెళ్లేందుకు రైలు టికెట్ సైతం రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ బావమరిది చనిపోవడంతో అంబులెన్స్‌లో రావాల్సి వచ్చింది. రైలుకు వెళ్లినా ప్రాణంతో ఉండేవాడని బంధువులు విలపించారు.



పక్కపక్కనే పేర్చిన బావ, బావమరుదుల చితిల వద్ద విషాదంలో బంధువులు

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం



సభలో ఐక్యతా అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నాయకులు

- కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కు తిరిగేందుకు రూ.79 కోట్ల ఖర్చు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో 'బహుజన విద్యార్థి భరోసా' సభ



ర్యాలీగా వస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పట్టించుకోని కేసీఆర్ దుకాణం బంద్ చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతి భవన్ మధ్య తిరగడానికి ఏడాదికి రూ.79 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా' సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అంతకుముందు అదాలత్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు, అనంతరం విద్యార్థులతో కలిసి బైక్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పేపర్ లీకేజీ సమయంలో అందరికీ అందుబాటులో ఉచితంగా కోచింగ్ మెటీరియల్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, కానీ బహుజనుల రాజ్యంలో ఏసీ కోచింగ్ సెంటర్లు, ఉచితంగా వైఫై, కంప్యూటర్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. బహుజన రాజ్యంలో పేపర్ లీకేజీలు ఉండవని, అలాంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో 90శాతం మందు దొరుకుతుంది కానీ వైద్యం అందడం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాలు భూమిని దొంగలు కబ్జా చేశారని ఆరోపించారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు పేర్లతో కేసీఆర్ వస్తున్నాడు కానీ ఆయన దుకాణం బంద్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆర్‌ఎస్‌పీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్‌పీ విద్యార్థి మేనిఫెస్టోను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్, బొట్ల కార్తీక్, మాదారపు రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణక్వీన్, వరంగల్ రీజియల్ సెక్రటరీ కన్నం సునీల్, జిల్లా నాయకులు సారయ్య, మంద శ్యాం, శనిగరపు రాజు, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి కడుగుతుండగా..

- పాము కాటు.. చికిత్స పొందుతూ వివాహిత మృతి
- పలివేల్పులలో ఘటన



పద్మ (ఫైల్)

హసన్‌పర్తి : ఇంటి సామగ్రి కడుగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నగరంలోని పలువేల్పులలో జరిగింది. పలివేల్పులకు చెందిన సల్లా పద్మ(38) ఉదయం ఇంటి ఆవరణలో సామగ్రి (బోళ్లు) కడుగుతుండగా పాము కాటు వేసింది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అప్పల బాధ భరించలేక రైతు ఆత్మహత్య..

అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బైరి సాంబరెడ్డి(58), అవసరాల నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశారు. తీర్చే మార్గం కనిపించక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లావెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యువతి యత్నం



చికిత్స పొందుతున్న ప్రభావతి

గూడూరు: ప్రియుడి పెళ్లికి నిరాకరించాడనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ ప్రభావతి, శివాలయం వీధికి చెందిన కస్నబోయిన కార్తీక్ ప్రేమించుకుంటున్నారు. కాగా, కార్తీక్ పెళ్లి నిరాకరిస్తున్నాడని ప్రభావతి ఆదివారం అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. అదే రోజు రాత్రి కార్తీక్ నర్సంపేట బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా బీసీ వర్గానికి చెందిన కార్తీక్.. కొందరి మాటలు విని తన ప్రేమను అంగీకరించడం లేదని ప్రభావతి మనోవేదన గురైంది. ఈ క్రమంలో తాను పురుగుల మందు తాగుతున్నానని, తన మృతికి కార్తీక్‌తో పాటు ప్రేమను కాదంటున్న ఆయన కుటుంబ సభ్యులే కారణమని ఓ లెటర్ రాసింది. అనంతరం పురుగుల మందు తాగింది. ఈ విషయం తల్లికి తెలుపగా కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రభావతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన (పోక్సో) కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పరకాల పట్టణానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని.. లేదంటే మీ అమ్మానాన్నను చంపుతానని వరంగల్ రంగంపేటకు చెందిన వివాహితుడు మహ్మద్ సమీర్ అలియాస్ సాజిత్ 2019 ఏప్రిల్ 24న రాత్రి బెదిరించి వెంట తీసుకెళ్లాడు. 15 రోజులు వివిధ ప్రాంతాల్లో తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో సాజిత్‌కు జైలుశిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసులు అధికారులు మధు, రవికిరణ్, వెంకటరత్నం పరిశోధించగా.. వైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెచ్‌సీ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థుల ఆందోళన



గేట్ వద్దనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల (ఎస్‌ఎఫ్‌సీ) విద్యార్థులు తమకు హాస్టళ్ల వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం నుంచి మొదటి గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి 11గంటల వరకు కూడా కొనసాగింది. అక్కడే బయటి హాస్టల్‌నుంచి తెచ్చిన సహపంక్తి భోజనాలు చేశారు. మహిళా హాస్టల్‌లో సెల్ఫ్‌ఫైనాన్స్‌కోర్సుల విద్యార్థులు కొందరు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఈ నెల 7న అధికారులు వారిని ఖాళీ చేయించారు. మంగళవారం కూడా పలువురు విద్యార్థినులను ఖాళీ చేయించి బ్యాగులు బయటపెట్టారని ఆరోపిస్తున్నారు. తాము ఎక్కడ ఉండి చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉందని, టైంటేబుల్‌ను కూడా వెల్లడించారని తెలిపారు. యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో హాస్టల్ వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థులు వినలేదు. వీసీ వచ్చి తమకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా మరో 15 రోజుల్లో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 15నుంచి 20మంది వరకు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఖాళీ చేయించామని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదం..

గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్కడినుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంత తోపులాడుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పోలీసులు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.